# 'ఓరేయ్ రామస్వామీ!'

కామరాజు



## పేరులో ఏముంది? అంటారు.

పేరు.

పి. ఆర్.

కాకినాడలో ఉన్న. చరిత్రలో స్థానం సంపాదించుకొన్న పిఠాపురం రాజావారి కాలేజి పి. ఆర్. కాలేజి.

కాకినాడలోనే కాదు. తూర్పు గోదావరి జిల్లా అంతటికీ తలమానికంగావున్న దుకాణం పి.ఆర్.దుకాణం అంటే పుణుకుల రామస్వామి దుకాణం.

అన్నిటినీ మించి పి. ఆర్. కాలేజి ప్రధానోపన్యాసకులుగా ప్రసిద్ధి చెందిన. విద్యావేత్తల కోవలో ఒకరైన పెద్దాడ రామస్వామిగారు. పి. ఆర్.

ఏ ఒక్కరిని ఒక్క కోణం నించి పరిశీలించి ఒక అభిప్రాయానికి రావడానికి వీలు లేదు.

పి. ఆర్. అంటే పెద్దాడ రామస్వామి గారు. గొప్ప వక్త. ఇంగ్లీషు పండితుడు. ఇంగ్లీషులో ఇంగ్లీషువాడికి మించిన అధికారం సంపాదించిన ఆంధ్రుడాయన. షేక్స్పియర్ నాటకాలు అంత గొప్పగా బోధించిన అధ్యాపకుడు తెలుగునాట మళ్ళీ పుట్టలేదంటే అతిశయోక్తి ఉండదేమో!

షేక్స్పియర్ చెప్పడంలో అంతటి నైపుణ్యం ఆయన సంతరించుకొనడానికి ముఖ్యమైన కారణం లేకపోలేదు. పి. ఆర్. గొప్ప నటుడు.

పెద్దాడ రామస్వామిగారి భాష ఎంత గొప్పదో ఆయన వేషం అంతటి విశిష్టమైనది. నల్లటి బూట్లు అవే రంగు సాక్సు. తెల్లటి మల్లెపువ్వులాంటి ధోవతి. తెల్లటి చొక్కా. నల్లటి కోటు. నల్లటి టై. నల్లటి ఫ్రేములో బిగించిన కళ్ళద్దాలు. తెల్లటి చేతి రుమాలు.

ఒంటెద్దు బండిలో ఆయన కళాశాల ఆవరణలో ప్రవేశించారనడానికి వేరే నిదర్శనం అక్కరలేదు— ఒక్కసారి కళాశాల ఆవరణమంతా నిశ్శబ్దం ఆవరించేది.

పి.ఆర్. నిష్క్రమణం కూడా అంతే వైశిష్ట్యం సంతరించుకొంది. ఆయన బండి కళాశాల గేటుదాటేసరికి కళాశాల ఆవరణం భయంకర శబ్ద ప్రపంచంగా మారిపోయేది.

పి.ఆర్.చదువుకొనే రోజుల్లో-మరిచాను అంతకు ముందు పి.ఆర్. కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్న వేమూరి రామకృష్ణరావుగారి విద్యార్థులలో ఒకడాయన— కాకినాడలో అంతటి గొప్ప రౌడీ లేడు అంటారు చరిత్రకారులు.

కళాశాల ప్రిన్సిపల్ అయిన తరవాత విద్యార్థులలో క్రమశిక్షణ లోపించకుండా కాపాడడానికి విద్యార్థి దశలో ఆయన గడించిన అనుభవం. రౌడీగా సంపాదించిన కీర్తి ప్రతిష్ఠలు ఆయనకు ఎంతైనా ఉపకరించాయి.

ప్రిన్సిపల్ పదవి అలంకరించడానికి ముందు పెద్దాడ రామస్వామిగారు ఇంగ్లీషు లెక్చరర్.

ఎంతటి ప్రతిభావంతుడయినా, నటుడైనా పి.ఆర్. మనిషి. కొన్ని అలవాట్లకు బానిస.

లెక్చర్ ప్రారంభించే ముందు కొంచెం వెనక్కి— అంటే బ్లాక్ బోర్డు వైపు- తిరిగి చేతి రుమాల తీసి, కళ్ళద్దాలు తుడిచేవారు ఆయన. చేతిరుమాల జేబులోంచి తీయగానే దాదాపు రెండు వందల మంది విద్యార్థులు ఒక్కసారి ఊపిరి పీల్చేవారు.

ఎంతటి శబ్దం పుడుతుందో ఊహించు కోవచ్చు.

ఆయన చాకులా క్లాసువైపు తిరిగి, "వాట్స్. దట్ ?" అని గర్జించేవారు.

అంతే-మళ్ళీ నిశ్శబ్దం.

పి. ఆర్. కళ్ళద్దాలు తుడిచేపని ఇంకా పూర్తి కాలేదు గదా ?

ఆయన మళ్ళీ వెనక్కి తిరిగేసరికి విద్యార్థులు మళ్ళీ ఊపిరి పీల్చేవారు. ఆయన గర్జించేవారు.

మూడునాలుగు పర్యాయాలు ఈ నాటకం సాగిన తరవాత కాని పి. ఆర్. లెక్చర్ ప్రారంభించేవారు కారు. అప్పటికి కాని విద్యార్థులకు సంతృప్తి ఉండేది కాదు. ఆ మాటకు రామస్వామిగారికీ ఆనందం ఉండేదికాదు. తరవాత విద్యార్థులు ఊపిరి బిగబట్టి ఆయన లెక్చర్ వినేవారు.

ప్రిన్సిపల్‌గా ఉన్నప్పుడు ఏ విద్యార్థి తనదగ్గరికి వచ్చి ఏమి చెప్పుకోబోయినా మాట్లాడనిచ్చేవారు కారాయన. 'బ్లాకెన్ ది పేపర్' అనేవారు. నోటిమాట కాదు. వ్రాసి ఇవ్వాలి. అప్పుడు కాని అయన దేనినీ పరిశీలించేవారు కారు.

## నిశా ఉదయం

దీపాలు!—
శ్రమఫారికా స్వప్నాలు!!
భూగర్భం నుంచి ఆవిర్భవించిన—
క్రాంతి ఖడ్గాలు!!
మట్టి శరీరాలు
నిరంతరం స్వేదిస్తూ—
లోకానికి కాంతి దానం చేస్తున్నాయి!!
రాత్రి కూడా—
భూమిమీదకు దిగడానికి భయపడుతోంది!—
ఒక్కొక్క కిటికీలో,
లక్ష సూర్యులు ఉదయించడం చూసి!!
విశాలమైన ఆకాశం—
దూది పింజాల మీద దొర్లి దొర్లి
మెరుగుతోంది !
చిక్కిపోయిన చిరుదివ్వె చివరి కాంతి
బొట్టును—
కూడా స్నేహితుడా! -నీ కోసమే విడుస్తా
నంటోంది!!
ఒక్క దీపం ఉజ్వరిల్లీ ప్రజ్వలిస్తే—
నక్షత్రాల మాటున దాగున్న—
తుఫానులు సైతం—
దాని నీడలో మోకరిల్లి సలాం చేస్తాయి!!
మేఘాలు హడావిడిగా పరుగిడుతున్నాయి-
సూర్యుడ్ని—
పశ్చిమ సంద్రంలో నే మునిగిపొమ్మని
చెప్పటానికి!
అవును మరి!—
రేపటినుంచి తూరుపు గుమ్మంలో—
ఒక జ్యోతి వెలుస్తోంది!!!!!

—శశిశాస్త్రి

ప్రిన్సిపల్‌గా ఉన్న కాలంలో ఆడపిల్లల జోలికి ఎవరు పోయినా పి. ఆర్. సహించేవారు కారు. ఆయన దృష్టిలో మాత్రం ఆడపిల్లలు చెప్పినదే వేదం. దానికి తిరుగులేదు. పి. ఆర్. చర్య తీసుకొనేవారు.

సహజంగానే విద్యార్థులకు రామస్వామి గారి పట్ల భక్తి ప్రపత్తులతో బాటు కొంత గుర్రు ఉండేది! కొంతేమిటి కొండంత.

ఆ గుర్రు చూపుకొనడానికి విద్యార్థులకు ఒక అవకాశమూ ఉండేది.


పెద్దాడ రామస్వామిగారి అటెండర్ పేరు పి ఆర్. ఇంటి పేరు నాకు గుర్తులేదు. అతడి పేరుమాత్రం రామస్వామి. పి. రామస్వామి.

ప్రిన్సిపల్‌గారు గదిలో వున్నప్పుడు అడపా దడపా విద్యార్థులలో ఎవరో ఒకరు ఆ గది గుమ్మం దగ్గరికి రావడమూ—

"ఒరేయ్ రామస్వామీ!" అని బిగ్గరగా అరిచి పారిపోవడమూ కద్దు.

దానికి రామస్వామిగారు ఏనాడూ కోపగించుకోలేదు. ఎవరినీ దండించలేదు. తన అటెండర్‌ను తీసివేయనూ లేదు.

"హూ యీజ్ దట్?" అని కేకవేసి, గదిలో ఎవరికీ తెలియకుండా ఒక చిరునవ్వు నవ్వుకొని ఊరుకొనేవారు!



## సంఖ్యావినోదం

$12 \times 42 = 21 \times 24$

$23 \times 64 = 32 \times 46$

$34 \times 86 = 43 \times 68$

$46 \times 96 = 64 \times 69$

ఈ సమీకరణాలలో ఎడమవైపు సంఖ్యలు తిరగబడగా కుడివైపు సంఖ్యలు ఏర్పడ్డాయి. రెండు స్థానాల సంఖ్యలతో యీ ధర్మంగల సమీకరణాలు యింకా పది మాత్రం రాయగలం.

ప్రశ్న (3): ఆ సమీకరణాలేవి?

హెచ్చవేయగ తిరగబడే సంఖ్యలు మూడుస్థానాలసంఖ్యలలోకూడా వున్నాయి. అలాటి సంఖ్యలు కొన్ని యీ దిగువ ఇవ్వబడినవి:

$102 \times 402 = 201 \times 204$

$213 \times 624 = 312 \times 426$

$324 \times 846 = 423 \times 648$

ఇంకా యిలాటి సమీకరణాలు 57 రాయవచ్చు. నాలుగు స్థానాల సంఖ్యలతో యిలాటి సమీకరణాలు రాయటం మరింత కష్టం. కొన్ని యీ దిగువ ఇవ్వబడినవి.

$1011 \times 7707 = 1101 \times 7077$

$2003 \times 6004 = 3002 \times 4006$

$3021 \times 2406 = 1203 \times 6042$

ప్రశ్న (4) : Great Geometer అని ఎవరికి పేరు?

### తెలుసుకోండి

ప్రతి సంఖ్యను $7n$, $7n \pm 1$, $7n \pm 2$, $7n \pm 3$.— వీటిలో యేదో ఒక రూపంలో రాయవచ్చు.

### క్రితం వారం ప్రశ్నలకు జవాబులు

ప్రశ్న (1) : $4997 + 2 = 4999$

$4997 \times 2 = 9994$

$49997 + 2 = 49999$

$49997 \times 2 = 99994$

ప్రశ్న (2) : 4 వ శతాబ్దికి చెందిన గ్రీకు గణితశాస్త్రవేత్త హైపేషియా (HYPATIA) చరిత్రలో మొదటి గణిత శాస్త్రజ్ఞురాలు.

— జగన్మోహనరావు